క్లుప్తంగా

పాఠశాలకు నేమ్ బోర్డు బహూకరణ



జంపని(వేమూరు): జంపని జెడ్పీ ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన గవిని శ్రీ కృష్ణ రాములు పాఠశాలకు బోర్డు బహూకరించినట్లు హెచ్ఎం బద్రినారాయణ ఆదివారం తెలిపారు. బోర్డు విలువ రూ.25 వేలు ఉంటుందని పేర్కొన్నారు. దాత శ్రీరాములను సత్కారించారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ చుండూరు రవికుమార్, ఉపాధ్యాయులు శివయ్య, శ్రీనివాస్ కుమార్, రవిరాజు, నరసింహరావు, పోతురాజు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

వెల్లబాడు (వేమూరు): వ్యవసాయంలో అప్పుల పాలై..పురుగు మందు తాగి ఈపూరు కిషోర్(30) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు కథనం మేరకు.. వేమూరు మండలంలోని వెల్లబాడు గ్రామానికి చెందిన ఈపూరు కిషోర్ కొల్లూరు మండలంలోని ఈపూరు గ్రామంలో కౌలుకు పొలం సాగు చేస్తున్నాడు. సాగులో నష్టం రావడంతో అప్పులు పాలయ్యాడని..అతని కుటుంబ సభ్యులు ఎస్ఐ చోడయ్యకు వెల్లడించారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం వెల్లబాడు గ్రామంలో కిషోర్ పురుగుమందు తాగాడు. అతనిని 108 వాహనంలో తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. వైద్యులు అతను మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య కూడా మూడేళ్ల క్రితం మరణించింది. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. మృతిపై కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ చోడయ్య తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించండి

రేపల్లె: ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ విజయ సారథి కోరారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరిగిపోయేందుకు అవకాశం ఉందన్నారు. మున్సిపాలిటీలోని ప్రతి ఒక్కరూ..ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని కోరారు. పాలిథిన్, ప్లాస్టిక్ కవర్ల విక్రయించినా, వినియోగించిన జరిమానాలు తప్పవని స్పష్టం చేశారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



రేపల్లె: విజయవాడ పడమటలంకలోని నిత్య సహాయ మాత స్కూలులో రాజా ఎడ్యుకేషన్ అకాడమీ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన అబాకస్ పోటీల్లో రేపల్లె పట్టణ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పట్టణానికి చెందిన రాజా ఎడ్యుకేషన్ అకాడమీకి చెందిన సాకేత్‌కుమార్ ఫోర్ బై ఫోర్ క్యూబ్‌లో ప్రథమ స్థానం సాధించగా, దీపిక త్రీ బై త్రీ క్యూబ్‌లో తృతీయ స్థానం సాధించిందని తెలిపారు. అదేవిధంగా విహాత్ ద్వితీయ స్థానంలో నిలవగా, ఆకాంక్ష కన్సోలేషన్ బహుమతికి ఎంపికైందని చెప్పారు. విజయం సాధించిన విద్యార్థులకు ఆకాడమి నిర్వాహకురాలు సుగ్గుల పద్మజ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

నటులకు స్ఫూర్తి ఎన్టీఆర్

తెనాలి: అభిమానుల ప్రేమకు సాటి ఏదీ లేదని ప్రముఖ సినీనటి భారతీ విష్ణువర్ధన్ అన్నారు. తనలాంటి ఎందరికో మహానటుడు ఎన్టీ రామారావు స్ఫూర్తి అని చెప్పారు. తెనాలిలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీఆర్ శతజయంత్యుత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఇక్కడి ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటరులో జరిగిన సభకు మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. ఎన్టీఆర్ శతజయంతి చలనచిత్ర పురస్కారాన్ని భారతీ విష్ణువర్ధన్‌కు, ప్రముఖ మేకప్ కళాకారుడు పీతాంబరానికి ప్రదానం చేశారు. పీతాంబరం తరపున ఆయన తనయుడు, సుప్రసిద్ధ దర్శకుడు పి.వాసు పురస్కారాన్ని స్వీకరించారు. అనంతరం భారతీ విష్ణువర్ధన్ తన కృతజ్ఞతాపూర్వక ప్రసంగంలో, క్రీడలు, సంగీతం, నృత్యం అంటే ఆసక్తి కలిగిన తనను ఆర్టిస్టును చేసిన అమ్మానాన్నలేనని చెప్పారు. ప్రేక్షకుల ఆశీర్వాదంతోనే ఈ స్థాయికి చేరుకోగలిగినట్టు చెప్పారు. సినీ దర్శకుడు పి.వాసు మాట్లాడుతూ తన తండ్రి పీతాంబరంతో ఎన్టీఆర్‌కు గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సినిమా తీసి నష్టపోయిన తన తండ్రితో ఎన్టీఆర్ మళ్లీ సినిమాలు చేసినందునే, తానీస్థాయిలో ఉండగలిగినట్టు చెప్పారు. కొండెపి ఎమ్మెల్యే డోల బాలవీరాంజనేయులు మాట్లాడుతూ, సినీరంగంలో మకుటం లేని మహారాజులా ఎన్టీఆర్ వెలిగారన్నారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు తన ప్రసంగంలో తెలుగు భాష ఉన్నంత వరకు ఎన్టీఆర్ చిరస్థాయిగా ఉంటారని చెప్పారు. ప్రముఖ సినీ రచయిత సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ, అందం, అభినయంలో పోటీపడే మహానటి భారతి అన్నారు. కృష్ణుడు, రాముడు వంటి ఎన్టీఆర్ పౌరాణిక రూపాలన్నింటికీ శిల్పి పీతాంబరం అని చెప్పారు. తొలుత గీతం విద్యాసంస్థల అధినేత ఎం.భరత్, బాలకృష్ణ చిన్నకుమార్తె తేజస్విని చేతుల మీదుగా ఎన్టీఆర్ అవార్డులను ప్రదానం చేశారు. నందమూరి యశ్వంత్, చెన్నుపురి తెలుగు అకాడమీ ఎండీ తూమాటి సంజీవరావు, కన్నడ నటుడు అనురుతీన్, మలినేని ఇంజినీరింగ్ కాలేజి చైర్మన్ పెరుమాళ్, పాటిబండ్ల జ్యోతి మాట్లాడారు.

వెల్లివిరిసిన భక్తి భావం

- భక్తిశ్రద్ధలతో వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు
- కనుల పండువగా కన్యకా పరమేశ్వరి జయంతుత్సవాలు
- గ్రామ దేవతలకు పొంగళ్లు, ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలో ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: శ్రీ గోవింద మాంబ సమేత పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 16వ ఆరాధన మహోత్సవాలు విశ్వబ్రాహ్మణ కాలనీ ఆలయ కమిటీ, స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి ఆరాధన మహోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం వీరబ్రహ్మేంద్ర స్వామి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, కలశ స్థాపన, అష్టోత్తర సహస్రనామార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కృష్ణాపురపు బ్రహ్మాజీ, ఉపాధ్యక్షులుగా ఉప్పాల శ్రీనివాసరావు, శోభిరాల శివ వరప్రసాద్, సెక్రటరీగా పోలూరి భాస్కర్, ట్రెజరర్‌గా మానేపల్లి వెంకట నాగచక్రవర్తి, పొన్నాడ శ్రీనివాసరావు, చింతల జగన్మోహనరావు, కందేపి భాస్కర్, శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు చేజర్ల నారాయణరెడ్డి, వెదురుపర్తి లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

కనుల పండువగా కన్యకాపరమేశ్వరి రథోత్సవం

భట్టిప్రోలు: శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి మహోత్సవాల్లో భాగంగా భట్టిప్రోలులో అమ్మవారి దివ్య రథోత్సవం ఆదివారం కనుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా రథోత్సవ వాస్తు హోమం, బలిహరణ, కూష్మాండ బలి, కుంభ బలి నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పలువురు దంపతులు పాల్గొన్నారు. ఉదయం అమ్మవారి రథ నిర్మాణ దాతల గోత్ర నామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు సామూహిక కుంకమార్చనలు నిర్వహించారు. పూజా సామగ్రిని ఆత్మూరి సతీష్ కుమార్, విజయలక్ష్మి దంపతులు అందజేశారు. రథోత్సవంలో మాజీ మంత్రి నక్కా ఆనంద బాబు, రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, వాసవి సత్ర సముదాయం అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, వేమూరు మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, కొల్లూరు మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన ప్రసాద్ పాల్గొన్నారు. రాత్రి అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ అధ్యక్షులు తూనుగుంట్ల సాయిబాబా పర్యవేక్షించారు.

చినపరిమిలో వీరబ్రహ్మేంద్ర స్వామి వేడుకలు

శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవంలో భాగంగా చుండూరు మండలం చినపరిమి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. స్వామి వారి చిత్ర పటాన్ని భక్తులు ఊరేగించారు. భక్తులు స్వామి వారికి దివ్య హారతులు ఇచ్చి తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

4న గొరిగపూడిలో దేశమ్మ తిరునాళ్ల

గొరిగపూడి గ్రామ దేవత శ్రీ దేశమ్మ తల్లి తిరునాళ్ల 4న అత్యంత వైభవంగా జరుగనుంది. ఏటా వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజు అమ్మవారి తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సుమారు 230 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయ తిరునాళ్ల రోజున అమ్మవారికి పసుపు, కుంకుమలు, చద్ది నైవేద్యాలు భక్తులు సమర్పించుకుంటారు. విద్యుత్ ప్రభలను కట్టి, కనక తప్పెట్లతో, ఆట పాటలతో తిరునాళ్లను వైభవంగా నిర్వహిస్తారు.

4న ఓలేటమ్మ తిరునాళ్ల

ఓలేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఓలేటమ్మ తిరునాళ్ల మహోత్సవాలు 4 నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. అమ్మవారి సన్నిధికి వెంకట్రాజు నగర్, ఓలేరు నుంచి ప్రభలు వస్తాయి.



దేశమ్మ తల్లి విగ్రహం

వలివేరులో ఆరాధన

శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాలు వలివేరులో ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అన్నదానం చేశారు.

నేటి నుంచి బాబా మందిర వార్షికోత్సవాలు

చెరుకుపల్లి: చెరుకుపల్లి వీరరాఘవ పేటలోని సాయిబాబా మందిర 27వ వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ ప్రాంగణంలో అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం ఉదయం 6గంటలకు కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ.. మారిశెట్టి ఇందిరసాయి జ్యోతి, సాంబశివరావు దంపతులతో నిర్వహించటం జరుగుతుందన్నారు. 2న బాబాకు ప్రత్యేక అభిషేకాలు, 3న చివరి రోజు లక్ష మల్లెపూలతో విశేష పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించి, అన్నదానం చేయనున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం పౌరాణిక నాటకాలు, చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో బాబాను దర్శించుకొని, అన్నప్రసాదం స్వీకరించాలని శ్రీ షిరిడి సాయి సేవా సమితి సభ్యులు కోరారు.

నేటి నుంచి ఆనందీశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు

గుళ్లపల్లి గ్రామంలోని శ్రీ గంగాంబిక సమేత ఆనందీశ్వరస్వామి దేవస్థానంలో నూతన జీవధ్వజ, ఆలయ శిఖర ప్రతిష్ఠా మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధానార్చకులు ప్రయాగ రాంబాబు శర్మ ఆదివారం తెలిపారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. స్వామి వారికి 1న తెల్లవారుజామున ప్రత్యేక పూజలతో కార్యక్రమాలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. యంత్ర స్థాపన, ఆలయ శిఖర ప్రతిష్ఠ, జీవధ్వజస్థాపన, కళావహణ, మహాకుంభాభిషేకం, పూర్ణహుతి, పండిత పూజ, మహదాశీర్వచనం, శాంతి కళ్యాణం నిర్వహించటం జరుగుతుందన్నారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాలు స్వరణ వెంకట శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ, ఆయల చైర్మన్ ఓగిరాల వీరాస్వామి మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



కలశాలతో మహిళల నగరోత్సవం



గంగాంబికా సమేత ఆనందీశ్వరస్వామి

కన్యకా పరమేశ్వరి జయంతి పూజలు

కర్లపాలెం: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగాయి. వాసవి క్లబ్, క్వీన్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహిళలు 108 కలశాలతో కర్లపాలెంలో నగరోత్సవం నిర్వహించారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చేరుకుని కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటం వద్ద కలశాలు ఉంచారు. అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సహస్ర కుంకుమార్చన చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు తూనుగుంట్ల సాంబశివరావు, వాసవి క్లబ్ సభ్యులు కోడూరి చంద్రం విజయ్‌కుమార్, వాసవి క్వీన్స్ క్లబ్ సభ్యులు నాగశ్వేత, అనూష తదితరులు ఉన్నారు.

ఘనంగా పోతురాజుస్వామి కొలుపులు

దుండివారిపాలెంలో పోతురాజుస్వామి కొలుపులు ఆదివారం ఘనంగా జరిగాయి. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో పోతురాజుస్వామి తాడిచెట్టు వద్ద స్వామివారి ప్రతిమలకు, వీరతాళ్లు, వీర కత్తులకు పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలు, కనక తప్పెట్లతో గ్రామంలోని వీధుల్లో ఊరేగింపు చేశారు. గ్రామోత్సవంలో స్వామివారి ప్రతిమలకు మహిళలు నిండు బిందెతో నీళ్లు వారబోసి పసుపు, కుంకుమలు సమర్పించి మంగళ హారతులిచ్చారు. అనంతరం గ్రామం వెలుపల ఉన్న పోతురాజుస్వామి తాటిచెట్టు వద్ద స్వామివారి ప్రతిమలకు భక్తి శ్రద్ధలతో పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు

చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో వైశాఖ మాసం రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దేవాలయ ప్రాంగణంలో పొంగళ్లు పొంగించి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మాట్లాడుతూ వైశాఖ మాసం రెండవ ఆదివారం కావడంతో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు.



మే 3 నుంచి తిరునాళ్ల

బగళాముఖి అమ్మవారి వార్షిక తిరునాళ్ల మహోత్సవం మే 3 నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మోదుగుల ప్రభాకర్ రెడ్డి తెలిపారు. మొదటి రోజు చందోలు గ్రామంలో అమ్మవారి ఘటముల గ్రామోత్సవం ,4న చెరుకుపల్లి మండలం కుంచలవారి పాలెంలో గ్రామోత్సవం, 5న భవనంవారి పాలెం, చోడిపాలెంలో, 6న సంగుపాలెం, కోడూరు గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. 6న అమ్మవారికి పురాతన బంగారు ఆభరణాలు అలంకరించడం జరుగుతుందని పేర్కొన్నారు. 7న దేవాలయంలో పొంగళ్లు, నైవేద్యాలు సమర్పణ, మొక్కులు తీర్చుకునే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

బాల వికాస్ కేంద్రాలతో.. చిన్నారులకు సత్ప్రవర్తన

చెరుకుపల్లి: టీటీడీ ఏర్పాటు చేసిన బాల వికాస్ కేంద్రాలు చిన్నారుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసి, సత్ప్రవర్తనకు దోహదపడుతున్నాయని మాజీ ఎంపీపీ చెన్ను కోటేశ్వరరావు పేర్కొన్నారు. టీటీడీ ఆర్థిక సాయంతో సమరసత సేవా ఫౌండేషన్ నిర్మించిన దేవాలయాల్లో నడుపుతున్న బాల వికాస్ కేంద్రాల మొదటి వార్షికోత్సవం ఆదివారం గుళ్లపల్లి శ్రీ నూకాలమ్మ అమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించారు. కార్యక్రమానికి బాపట్ల జిల్లా బాల వికాస్ కేంద్రాల కన్వీనర్ యల్లా ప్రగడ సీతాపతి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్ను కోటేశ్వరరావు మాట్లాడుతూ.. బాల వికాస్ కేంద్రాల్లో చిన్నారులకు శ్లోకాలు, పద్యాలు, పాటలు, నృత్యం, కోలాటం వంటివి నేర్పించి, ప్రదర్శనలివ్వడం అభినందనీయమని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన బాలబాలికలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పోలగంగు శ్రీనివాసరావు, బండారు జ్వాల నరసింహం, బండారు శ్రీనివాసరావు, బొలగాని విజయలక్ష్మి, పడమట వెంకటేశ్వరరావు, జంజనం హేమ శంకరరావు, క్రాప రవికుమార్, అక్కల సుబ్బారెడ్డి, ఆలపాటి సుధారాణి, బాలవికాస్ ఆచార్య అయినంపూడి శివాజీ, చిన్నారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న మాజీ ఎంపీపీ, ఫౌండేషన్ సభ్యులు

ముప్పయ్యేళ్లకు ముచ్చటగా..



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

వేడుకగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నిజాంపట్నం: ఎన్నో ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు నిజాంపట్నం జెడ్పీ హైస్కూల్‌లో సందడి చేశారు. పాఠశాలలో 1988–89లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. 34 ఏళ్ల తర్వాత చదువులమ్మ ఒడికి చేరకుని, ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుంటూ.. జీవిత గమనాలను పంచుకున్నారు. గ్రూపు ఫొటో, సెల్ఫీలు తీసుకున్నారు. పాఠశాల ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేశారు. తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసిన ఆనాటి గురువులను గుర్తుచేసుకున్నారు. పలువురు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులందరూ.. సహపంక్తి భోజనం చేశారు.

అన్నమయ్య పాటల పోటీలు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలోని గీతామందిరంలో ఆదివారం శ్రీవేంకటేశ్వర అన్నమాచార్య సంకీర్తన సేవాబృందం ఆధ్వర్యంలో అన్నమయ్య పాటల పోటీలు నిర్వహించారు. ఆరేళ్ల నుంచి 60 ఏళ్ల వయస్కుల వారు 80 మంది ఈ పోటీల్లో పాల్గొని అన్నమయ్య గీతాలను ఆలపించారు. విజయవాడలోని ఘంటసాల సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందం న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. పోటీలో పాల్గొన్నవారిలో అందే తన్మయి, మువ్వా ప్రవష్టి, జాహ్నవి, హరిణి, మానసవీణ, శ్రీజ, అనిరుధ్, మేఘన, హిమబిందు తదితరులున్నారు. సంస్థ కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తన ప్రచారం నిమిత్తమే గత 11 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్టు తెలిపారు. అన్నమయ్య జయంతి రోజైన మే 7న తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. సంస్థ బాధ్యులు లక్కరాజు లక్ష్మణరావు, కొండపి వసుంధర, భారతీదేవి, దేవానంద్, లక్కరాజు కనకదుర్గ, జి.యశస్విని, ఎస్.దేవి లలిత, ఎస్.కేశవరావు, జి.శివజ్యోతి పాల్గొన్నారు.

పార్కులో విద్యుత్ శోభకు రూ.2 లక్షల సామగ్రి

తెనాలి: పట్టణ చినరావూరులోని మున్సిపల్ లేక్‌వ్యూ పార్కుకు స్థానిక నటరాజ్ జ్యూయలర్స్ అధినేత కొత్తమాసు కుమార్, చంపకవల్లి దంపతులు రూ.2 లక్షల విలువైన విద్యుద్దీపాలు, పరికరాలను అందజేశారు. విద్యుత్ బల్బులు పనిచేయక, వాకర్స్ పడుతున్న ఇబ్బందులను స్థానిక వార్డు కౌన్సిలరు గుంటూరు కోటేశ్వరరావు, నటరాజ్ జ్యూయలర్స్ దృష్టికి తీసుకెళ్లటంతో స్పందించిన సంస్థ యాజమాన్యం వితరణకు ముందుకొచ్చింది. పార్కు ఆవరణలో ఆదివారం పట్టణ ప్రముఖులు, వాకర్స్ సమక్షంలో ఆయా సామగ్రిని కొత్తమాసు కుమార్ అందజేశారు. సమస్యను చెప్పగానే స్పందించి సాయం చేసిన కొత్తమాసు కుమార్‌కు గుంటూరు కోటేశ్వరరావు, వాకర్స్ ధన్యవాదాలు తెలియజేశారు. అవసరమైన సామగ్రిని అందించటంతో పార్కుకు విద్యుత్ శోభ సమకూరుతుందనీ, భవిష్యత్‌లో పార్కు అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని కుమార్ ప్రకటించారు. మామిళ్ల జగదీష్, మేడేపల్లి ప్రభాకర్, మామిడాల సుమన్, సురుపుల వెంకట్రావు, పెరుగు మల్లికార్జునరావు, కొణిజేటి శ్రీనివాసరావు, అడపాల ఏడుకొండలు, సుధాకర్, అల్లంపల్లి ప్రసాద్, చుండూరు అరుణకుమార్, నాంచారమ్మ, మున్నంగి సత్యం పాల్గొన్నారు.

దంటు.. తగలబెడితే చేటు

భట్టిప్రోలు: మొక్కజొన్న దంటును పొలాల్లో తగలబెట్టకుండా, కలియ దున్నతే సేంద్రియ ఎరువుగా పనికొస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. డెల్టా ప్రాంతంలో రెండో పంటగా సాగు చేస్తున్న జొన్న, మొక్కజొన్న పైరు కండెలు విరచిన తర్వాత దంటును కొందరు రైతులు పొలాల్లోనే తగలబెడుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే విధంగా దంటు కాలుస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో జొన్న, మొక్కజొన్న దంటును కాల్చడం వల్ల అగ్ని ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉంది. దంటుకు నిప్పంటించడంతో నిమ్మ, అరటి తదితర పైర్లు కూడా అగ్ని ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. జొన్న, మొక్కజొన్న దంటును మాగాణిలో తగలబెట్టడంతో భూమికి గల సహజ సిద్ధమైన లక్షణాలు కూడా దెబ్బతింటాయి.

రొటోవేటర్లతో కలియదున్నాలి

దంటును రొటోవేటర్లతో భూముల్లో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా పనిచేస్తుందని రేపల్లె ఏడీఏ అక్తర్ హుస్సేన్ తెలిపారు. భూములు సారవంతంగా మారుతాయన్నారు. తద్వారా రసాయన ఎరువు వినియోగం గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. వీలున్నంత వరకు దంటును కాల్చకుండా చూడాలని రైతులకు సూచించారు.



పంట పొలంలో తగలబడుతున్న మొక్కజొన్న దంటు

మహాప్రస్థానంలో మార్చురీ రూం నిర్మాణం

తెనాలి: పినపాడులోని మహాప్రస్థానంలో మార్చురీ రూంను నిర్మించనున్నారు. మహాప్రస్థాన సేవాసమితి ఆధ్వర్యంలో మార్చురీ రూమ్ నిర్మాణానికి ప్రవాస భారతీయుడు ఆదివారం రూ.4.50 లక్షల చెక్కును సమితి నిర్వాహకులకు అందజేశారు. ఇటీవల మృతిచెందిన జిల్లా పరిషత్ విశ్రాంత సీఈవో వీడీఆర్ మనోహర్ జ్ఞాపకార్థం ఆయన తనయుడు అమెరికాలోని జిప్సమ్ కార్పొరేషన్ చీఫ్ కంట్రోలర్ ఇంజినీర్ వీరమాసునేని శ్రీనివాస్ అవసరమైన మొత్తాన్ని చెక్కురూపంలో విరాళంగా ఇచ్చారు. రానున్న మార్చురీ రూంకు వితరణ చేసిన దాతను అభినందించారు.

కష్టజీవుల కవి శ్రీశ్రీ



శ్రీశ్రీ కవితల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సాయిబాబు

బాపట్ల: సాహిత్య మార్గాన్ని విప్లవీకరించి, పీడిత జనుల పక్షాన నిలబడిన గొప్ప కవి శ్రీశ్రీ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పీసీ సాయిబాబు పేర్కొన్నారు. శ్రీశ్రీ 113వ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక శ్రీశ్రీ కవితల పుస్తకాని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ .. సామాజిక విప్లవానికి పురోగామిగా సాహిత్య విప్లవం సాగాలని విశ్వసించారు. విప్లవ సాహిత్య యుగకర్తగా ఖ్యాతి గడించి, కష్టజీవుల హృదయాలకు తగిలిన గాయాలను గేయాలుగా మార్చారని గుర్తుచేశారు. బాధలు, భయాలు లేని నూతన సమాజ నిర్మాణాన్ని శ్రీశ్రీ కాంక్షించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంజీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.శాంత కుమారి, ఉపాధ్యాయులు రమాదేవి, శివపార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి



పవన్‌రెడ్డిని అభినందించిన ఎమ్మెల్యే కోన

కర్లపాలెం: భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ చాటిన అక్కల పవన్‌రెడ్డిని ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదివారం అభినందించారు. జేఈఈ మెయిన్స్‌లో 99.73 శాతం సాధించి సత్తాచాటిన పవన్‌రెడ్డి తన తండ్రి అక్కల రమణారెడ్డితో కలిసి బాపట్లలో ఎమ్మెల్యే కోన రఘుపతిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన పవన్ రెడ్డిని అభినందించారు. జెడ్పీటీసీ సభ్యుడు పిట్ల వేణుగోపాల్‌రెడ్డి. కొత్త నందాయపాలెం ఉప సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కాగిత బుల్లియ్య, వైఎస్సార్ సీపీ బాపట్ల రూరల్ మండలాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, నాయకులు ఆట్ల హరిబాబురెడ్డి, గొర్రుముచ్చు మీరయ్య, చీరాల బ్రహ్మానంద రెడ్డి, ఎస్కే సుభాని తదితరులు ఉన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

తెనాలిటౌన్: శ్రీ ఆంజనేయం ధ్యాన యోగ మండలి వ్యవస్థాపకులు కిషోర్ గురూజీ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం పట్టణంలోని పలు సెంటర్లలో పేదలకు దుస్తులు పంపిణీ చేసి అల్పాహారం అందజేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మారీసుపేటలోని అప్పలస్వామి గుడి వద్ద తులసి ఆకుల చలివేంద్రం ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని కిషోర్ గురూజీ ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేశారు. చలివేంద్రాన్ని కడిదం కోటేశ్వరరావు, శివరామిరెడ్డి సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాడికొండ శ్రీనివాసరావు, ముంతా శ్రీనివాసరావు, కూరపాటి నాగరాజు, పురుషోత్తమ కృష్ణ, చెంచయ్య, సత్యనారాయణ, నాగేశ్వరరావు, సుబ్బారావు, సుజాత, భూపతి, ప్రసాద్, శాంతి, గుప్తా, కోమల, యోగమండలి సభ్యులు పాల్గొన్నారు.